


# సింహం

**కె. రఘురామం**

"ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోకి గొప్ప సర్కస్ వచ్చిందిట! వెడదాం, నాన్నా!" అని మా సుపుత్రుడు ఒకటే పోరు. వీడికి ఈ కాలం కుర్రాళ్ళ నాలా మందికి మల్లే చదువంటే ఆవగింజంతా; సినిమాలూ, సర్కస్‌లూ అంటే ఆకాశమంతా అభిమానం.

"అస్తమానం సర్కస్‌లూ అవీని!" అని విసుక్కున్నాను. 'ఇంట్లో రోజూ జరిగే సర్కస్ ఫీట్లు చూస్తున్నావుగా! అది చాలదూ?' అందామనుకొన్నాను. కాని, మా సుపుత్రుడికి సినిమాలూ వగైరాలు మినహా ఇంకే విషయాలూ ఎక్కవని మొదటే చెప్పానుగా!

నా సమాధానం మా వాడయితే విన్నాడో లేదోగాని, మా ఆవిడ మాత్రం వింది. విన్నాక ఊరుకోవడం ఆవిడ మనస్తత్వం కాదు. "ఏమిటండీ! మీరు మరీ. ఏదో పిల్లవాడు అడక్క అడక్క అడిగితే!" అంటూ లంకించుకొంది.

ఈవిడతో ఇదే చిక్కు. పిల్లల్ని ఎలా పెంచాలో తనకి తెలిసినంతగా నాకు తెలియదనుకొంటుంది. అలా అనుకొంటూనే వాళ్ళని నెత్తికి ఎక్కించుకొంటుంది. ఇంక వాళ్ళని కిందికి దిగమంటే దిగుతారా? అసలు ఆవిడ మనస్సుకి ఎలాంటి కళ్ళు ఉన్నాయో, ఏమిటోగాని, దానికి నేను తప్ప అందరూ కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిమీద జల్లుకోదగిన వాళ్ళలా కనబడతారు. ఆఖరికి మా మామగారు పోయాక, ఆయన ఆస్తికి వారసుణ్ణంటూ మా ఆవిడమీద దావా వేయబోయిన ఆయన తమ్ముడి కొడుకుకూడా నా కంటే నమ్మకస్తుడిలాగే కనబడతాడు ఆవిడికి.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ఆ రోజు సాయంత్రం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వెళ్ళడానికి నేనే స్వయంగా టాక్సీ తీసుకురాక తప్పలేదు.

తీరా టాక్సీ దిగాక, సర్కస్‌కి టిక్కట్లు తీయడం విషయంలో కూడా ఇదే తంతు. "అంత ఖర్చెందుకు, మధ్యరకం టిక్కట్లు కొందాం" అన్నాను. అప్పుడు మా ఆవిడ చూసిన చూపుకి అక్కడ ఉన్నది మీ రయితే, కౌశికుడి చూపుకి కొంగకి పట్టిన గతే మీకూ పట్టేది! అది నేను కనకన్నూ, బాగా అలవాటయిన వాడిని కనకనూ సరిపోయింది. 'ఇదే పట్నం నడిబొడ్డులో ఉన్నా కనక గాని, లేక పోతేనా?' అన్నంత అర్థం ఉంది ఆ చూపులో.

టాక్సీవాడుకూడా, "అదేంటయ్యా! రిజర్వుడికి తీసుకోక" అన్నాడు. వాడు నయం! ఇన్నేళ్ళు కాపరం చేసినా నేను అర్థం చేసుకోలేని మా ఆవిడ మనస్తత్వాన్ని అర్ధ గంటలో అర్థం చేసుకోగలిగాడు.

వాడికి తెలిసినంతకూడా మీకు తెలియదన్నట్లు ఒకసారి నా వైపు, ఎంతో మెచ్చుకోలుగా వాడి వైపూ చూసి, మీటర్ ప్రకారం మూడున్నరే అయినా, ఐదు రూపాయల కాగితం ఇచ్చి, చిల్లర వాణ్ణే ఉంచేసుకొమ్మంది మా ఆవిడ.

వాడు ఆవిడకి ఒక సెల్యూట్ చేసి, నా కోపపు చూపుల్ని లెక్క చేయకుండా వెళ్ళిపోయాడు. నేను టాక్సీ వెళ్ళినవైపు వాడిమీద కోపంతో చూస్తూనే ఉన్నాను.

ఒక చేత్తో టిక్కట్లూ, ఇంకో చేత్తో వంద రూపాయల నోటు తాలూకు చిల్లరతో మా ఆవిడ వచ్చి, 'రండి' అని లొక్కుపోయేదాకా అలాగే ఉండిపోయాను.

అందరూ మా ఆవిడలాంటి వాళ్ళే ఏమో! మేము తీసుకున్న రిజర్వుడు క్లాసుకూడా అప్పటికే కిటకిటలాడుతూంది. మాకు ఎక్కడా చోటు దొరక్క చివరికి సర్కస్‌వాళ్ళు రింగ్

మీదికి వచ్చి ప్రవేశద్వారం వైపు కూర్చున్నాం.

సరిగ్గా మ్యూజిక్ వాయించేవాళ్ళకి చాలా దగ్గిరగా ఉన్నామేమో, చెవులు హోరెత్తిపోతున్నాయి. వెంటనే అక్కడి నించి వెళ్ళిపోయి, ఇంకో చోట కూర్చుంటే బాగుంటుం దనిపించినా, ఆ ఆలోచన అదిమిపట్టి ముళ్ళ కుర్చీమీద కూర్చున్నట్టు కూర్చున్నాను అక్కడే. చోటు మారటం అన్న ప్రతిపాదన నా దగ్గిర నుంచి వచ్చిందనగానే, అంతకు ముందు తనకి కూడా అలాంటి ఆలోచనే వచ్చినా వెంటనే తన మనస్సు మార్చుకొని, అక్కడినుంచి కదలనంటుంది మా ఆవిడ! నా తెలివి తేటలమీద అంత నమ్మకం ఆవిడికి!

సర్కస్ ఎప్పుడు మొదలయిందో తెలియదు. కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. కాని, దేన్నీ చూడటం లేదు. చెవుల్లో హోరుతో తల పగిలిపోతూంది. మా వంశోద్ధారకుడూ, మా ఆవిడా మాత్రం కొన్న టిక్కెట్ విలువని మించి ఎక్కువ ఆనందాన్ని పొందుతున్నారు సర్కస్ చూడటంలో. ఆ ఆనందంలో నన్నుకూడా పాలుపంచుకోమన్నట్టు మా ఆవిడ నా డొక్కలో మోచేత్తో పొడుస్తూండటమే అందుకు సాక్ష్యం.

ఇలా ఎవళ్ళ లోకంలో వాళ్ళు ఉండగా మా వాడు గట్టిగా అరిచాడు: "నాన్నా! సింహం!" అని. తాత్కాలికంగా ఆలోచనలని పక్కకి నెట్టి ఎదురుగా చూశాను. ఒకరిద్దరు బఫూన్‌లు ఏవో పాట్లు పడుతున్నారు ప్రేక్షకులని నవ్వించడానికి. ఇదేమిటా అని నేను ఆశ్చర్యపోయేటంతలోనే మా వాడు—"అదిగో" అంటూ మా పక్కనే ఉన్న ప్రవేశ ద్వారం వైపు చూపించాడు. వాడి ముఖం ట్యూబ్‌లైట్‌లా వెలిగిపోతూంది. అటువైపు చూశాను అప్రయత్నంగానే. ఆ తరవాత ప్రయత్నించినాకూడా నా దృష్టి అటు నుండి మరల్చలేకపోయాను.

పొడుగు ఆరడుగులు ఉంటుంది. ఒకప్పుడు బాగా ఉన్నప్పటి కండలు, ప్రస్తుతం తిండి లేమిచేత ఎండిపోయి వేలాడుతున్నాయి. అమెరికా ఆడవాళ్ళ బాబ్డ్ హేర్‌లాగ చక్కటి జూలు. గట్టిగా గర్జిస్తూ బోనులోనే ఎంతో హడావిడిగా తిరిగేస్తూంది సింహం! అది బోనులో ఉన్నా, బక్కచిక్కిపోయినా సింహమే. ఒక్కగానొక్క బక్క మనిషికి లోబడిపోయి, కొన్ని వేల మంది ప్రేక్షకులకు వినోదం కలిగించబోతూంది.

నాకు మాత్రం దాన్ని చూస్తే విపరీతమయిన జాలి వేసింది. ఎందుకో తెలియదు. ఇదే మా ఆవిడతో అంటే, "పోదురూ! మీది మరీ విడ్డూరం. సింహం బోనులో ఉన్నా చూడండి, ఎంతమందికి వినోదం కలిగిస్తూందో చక్కగా!" అంటుంది. నా ఆలోచనలని అర్థం చేసుకొనే మెదడు దేవుడు దానికివ్వలేదు. అంతటితో ఊరుకున్నా బాగుండేది. ఆ దేవుడే నాకూ, ఆ బోనులో సింహానికీ—ఈ అస్వతంత్రత అంటగట్టాడు.

పాపం! ఈ సర్కస్ వాళ్ళకి చిక్కక ముందు ఆ సింహం ఎంత హాయిగా ఉండేదో! బహుశః అది ఉండే అడవికి అదే ఒకే ఒక ఏలిక అయి ఉంటుంది. తన ధైర్యపరాక్రమాలతో అడవి అంతా ఒక ఊపు ఊపి ఉంటుంది.

ఈ ఆలోచన నాకు కలగగానే నా మనస్సు ఇంకో వైపు మళ్ళింది.

అవును. ఈ సింహానికీ, నాకూ ఎంత పోలిక ఉంది? నేను లా కాలేజీలో చదివే రోజుల్లో మా కాలేజీకి పెద్ద హీరోలాంటి వాడిని. నా స్నేహం కోసం, కనీసం మాటకోసం ఎంతమంది నా చుట్టూ తిరిగేవారు? కారణం? మా కాలేజీలో జరిగే ఆటలన్నిటిలోను నేనే ఛాంపియన్‌ని. అలాగని ఈ కాలం కుర్రాళ్ళలాగ చదువులో వెనక పడలేదు. అందులోనూ ఫస్ట్ మార్కు నాదే! అందుకే లెక్చరర్స్ అందరికీ, చివరికి ప్రిన్సిపాల్‌కికూడా నే నంటే ఎంతో అభిమానం. ఇంతెందుకు? ఈ బోనులో పడడానికి ముందు, అడివిలో ఆ సింహం ఎలా ఉండేదో నేను కాలేజీలో అలా ఉండేవాడిని.

"అమ్మా! సింహాన్ని ఎంతకీ తీసుకురారేం?" మా వాడు వాళ్ళమ్మని అడుగుతున్నాడు. వాడి మాటలతో నా ఆలోచనల దారం తెగింది.


"గొడవ చెయ్యకు!" గదిమాను వాడిని.


"బాగుంది. వా డేమన్నాడని అలా విసుక్కుంటారు? 'స్వర్గానికి వెళ్ళినా


# కెల్వినేటర్ అన్నింటిలోనికి మేలైనదని మీకు మీరే రుజువుపరుచుకోండి

ఎలా? దిట్టమైన కెల్వినేటర్ ప్రత్యేకతలే నిదర్శనం. ఇతర రిఫ్రిజిరేటర్లతో పోల్చి, ఒక్కొక్క బేరీజు వేయండి. కెల్వినేటర్ మీ కెన్ని సౌకర్యాలు కూర్చగలదో మీరే తేల్చుకోగలరు.

రిఫ్రిజిరేటర్‌ను కొనబోయేముందు కెల్వినేటర్ సంగతి పూర్తిగా తెలుసుకోండి. నేదే వివరాలకు వ్రాయండి:





ఈ క్రింది కూపన్ కత్తిరించి పోస్టులో వేయండి.

కెల్వినేటర్ రిఫ్రిజిరేటర్ల వివరాలు తెలియజేయండి.

పేరు ______________________

విలాసం ______________________

______________________

మేలిరకాన్ని మాత్రమే కోరేవారికి
కెల్వినేటర్ Kelvinator

స్పెన్సర్ & కంపెనీ లిమిటెడ్
153, మౌంట్ రోడ్,
మద్రాసు-2

Bensons. 1666 Tel

**సింహం మృగరాజు కావచ్చు. కానీ, మృగరాజుకీ, మగమహారాజుకీ చాలా పోలికలుంటాయి. మగవాడు పెళ్ళికానంతవరకు, మహారణ్యంలో ఠీవిగా తిరిగే తిరిగే మృగరాజుతో సమానం. పెళ్ళి అయాక, పెళ్ళాం వచ్చాక..., అంతటి మగరాజు కూడా బోనులో చిక్కిన మృగరాజుతో సమానం. సర్కస్‌లో రింగ్ మాస్టర్ సింహాన్ని ఆడించినట్లే, ఇల్లాలు తన మొగుడైన మగమహాజుని ఆడించేస్తుంది.**

సవతిపోరు తప్ప'దన్నట్లు సరదాగా సర్కస్‌కి వచ్చినా వాడికి మా చివాట్లు తప్పవా?" అంటూ చుట్టూ జనం విని వినని స్థాయిలో సన్నాయి నొక్కులు పలికించింది మా ఆవిడ. దాని దృష్టిలో వాడిని దండించడానికి తన కొక్కతెకే హక్కుంది. నాకూ ఆ హక్కుందని తిరుగుబాటు చెయ్యడానికే నేను వాణ్ణి తిడతానని మా ఆవిడ అచంచలమైన అభిప్రాయం.

దానితో నేను మళ్లీ మొహం సర్కస్ రింగ్‌వైపు తిప్పి, ఆలోచనలు నా కాలేజీ రోజులవైపు మళ్లించాను.

మా లా కాలేజీ వార్షికోత్సవానికి హైకోర్ట్ రిటైర్డ్ చీఫ్ జస్టిస్ రావు గారు అధ్యక్షత వహించారు. ఆ రోజు పంచబడిన బహుమతులలో నాలుగో వంతు నేనే కొట్టేశాను. ఆటల్లో తీసుకున్నన్ని బహుమతులూ నేను చదువులోకూడా పొందటం రావు గారిని ఎంతగానో మెప్పించిందన్న సంగతి, ఆయన వచ్చి నా భుజం తట్టి, మనస్పూర్తిగా అభినందించినప్పుడు తెలుసుకున్నాను. ఆనందంలో మునిగి తబ్బిబ్బులయి పోయాను, అంత పెద్ద వ్యక్తిని నేను మెప్పించగలిగినందుకు!

అంతేకాని, ఆయన నా దారాసింగ్ సర్వనాల్టీకి, స్పోర్ట్స్‌మన్‌షిప్‌కీ, యూనివర్సిటీ ఫస్ట్ తెబోయే నా తెలివికి తగిన చక్కని బంగారు బోను తయారు చేస్తున్నారని ఊహించుకోలేకపోయాను.

అప్పట్లో ఎంతో అందంగా ఉండే మా ఆవిడ, ఆమె పేర రావుగారు పెట్టిన అంతులేని ఆస్తీ—ఇవీ నేను ఆ బోనులోకి వెళ్లడం కోసం పెట్టబడిన ఎరలు. దరిద్రంలో ఎంత బాధ ఉందో, ఆకలిమంట ఎంత తీవ్రమయిన అగ్నో బాగా అనుభవం ఉన్న నేను, నాకు పట్టబోయే ఆ అదృష్టంతో ఎన్నో సాధించాలన్న కోరికతో ముందూ, వెనకా — ఎటూ చూడకుండా రావుగారు నాకు మామగా రవడానికి ఒప్పుకొన్నా.

తీరా చేతులు కాలేక కాని నేను ఒప్పుకున్నది ఇల్లరికానికనీ, నా ఈ కొత్త జీవితం నా కోసం ప్రత్యేకంగా తయారుచేయబడ్డ బంగారు బోననీ తెలియలేదు. చేతులు కాలేక ఆకులు పట్టుకున్నా లాభం లేదని తెలుసు. అందుచేత ఆకులు పట్టుకోవడానికి ప్రయత్నించలేదు. కనీసం చెయ్యిని వెనక్కి తీసుకోవడానికయినా అవకాశం లేకపోయింది. నా చెయ్యి కాలి, కాలి, ఆ తరవాత మాడిపోయి, క్రమంగా నా జీవితం అంతా ఈ రకంగా వాడిపోతూంది.

"ఆ సింహం అంత బక్కచిక్కిపోయిందేమిటే?" మా వాడు వాళ్ల అమ్మని గట్టిగా అడుగుతూంటే ఆలోచనలనుంచి ఈలోకంలోకి వచ్చాను.

"చిక్కిపోతే నేం? ఎంత చక్కగా, చెప్పినట్టల్లా చేస్తూందో చూడు. గొడవ చెయ్యక." విసుగ్గా సమాధానం చెబుతూంది మా ఆవిడ. అంతకు కొద్ది నిమిషాల క్రితమే నేను వాణ్ణి విసుక్కున్నప్పుడు తన్న మాటలు మరిచిపోయినట్టుంది.

ఎంత చక్కని సమాధానం! సింహం చిక్కిపోయినా ఫరవాలేదుట! అది చక్కగా రింగ్ మాస్టర్ చెప్పినట్టల్లా ఆడితే చాలట. మా ఆవిడ మనస్తత్వానికి ఇదెంత చక్కటి ఉదాహరణో చూడండి! ఇదేరకమయిన మనస్తత్వంతోనే నన్నూ ట్రీట్ చేస్తూంది. నేను ఎలా అయిపోయిన ఫర్వాలేదు. ఇంత చదువూ చదివిన నా తెలివితేటలు అడుగంటిపోయినా, నా వ్యక్తిత్వం హరించుకుపోయినాసరే, నేను తను చెప్పినట్టల్లా ఆడితే చాలు!

రింగ్‌లో చేత్తో పొడవయినహంటర్ పట్టుకొని రింగ్ మాస్టర్ సింహాన్ని రకరకాల పొజిషన్‌లలో నిలబెడుతున్నా, అంత బలమయిన సింహమూ ఒక సామాన్యమయిన మనిషి చెప్పినట్టు కూర్చోమంటే కూర్చుంటూంది. కుర్చీ ఎక్కమంటే ఎక్కుతూంది. ఆ విధంగా చెయ్యటం దానికి ఎంత అయిష్టంగా ఉందో దాని ముఖమే చెబుతూంది. కాని, తప్పేదేమిటి?

ఇంక ఆ సింహానికి స్వాతంత్ర్యం దొరకదా? దానికి ఆజన్మాంతము బానిసత్వమేనా? ఈ రకమయిన ఆలోచనలతో ఎప్పుడు సర్కస్ అయిపోయిందో తెలియదు. మా ఆవిడే నన్ను కుదిపి, లేవదీసి, బయటికి నడిపించింది, "ఇక్కడా నిద్రేనా?" అని సణుగుతూ.

* * *

రెండు రోజులు పోయాక ఆ రోజున భోజనం వడ్డిస్తూ అంది మా ఆవిడ: "ఇంకా నయం. మనం సర్కస్‌కి నిన్న వెళ్లాం కాదు" అని. కనుబొమలు పైకెత్తి కళ్ళు పెద్దవి చేసి, కుడి చెయ్యి రొమ్ము మీద వేసుకుని భయాన్ని అభినయించింది.

నేను 'ఏమిటి సంగ'తని అడగలేదు. ఎందుకంటే నేను ఆ మాట అనకపోయినా, ఆవిడ తన ఉపోద్ఘాతానికి వెనక ఉన్న ఉపన్యాసాన్ని దంచక మానదు. ఇంతలోనే నా పుట్టేదో మునిగిపోయినట్టు, నా అంతట నేనే ఎందుకు రంగంలోకి దిగాలి?

"ఎందుకని అడగరేం?" అంది, దెబ్బతిన్న అభిజాత్యంతో. ఈవిడ ప్లేట్ ఇల్లా మార్చిందేమిటా అనుకొన్నాను.

"సరే. అడిగా ననుకో!" అన్నాను.

దానికి మా ఆవిడ చెప్పవలిసిన సరయిన సమాధానం— 'సరే. చెప్పాననుకోండి' అని. కాని, మా ఆవిడకి ఆ విధమయిన తెలివితేటలు లేవని మొదటే చెప్పానుగా. నా వాక్యాన్ని తనకి కావలిసిన అర్థానికి వీలుగా మలచుకోగలదు. అందుకే, 'అదేమిటో చెప్పవా?' అన్న అర్థం నా మాటకి తీసుకొని ఇక మొదలుపెట్టింది.

"ఎలా తప్పించుకొందో ఏమిటో? నిన్న రాత్రి సింహం తనకు కట్టిఉన్న గొలుసుల్ని విడిపించుకొని బయటకు దూకిందట. మొత్తం జనం అంతా కకావికలై పారిపోతుంటే అప్పుడు రింగ్ మాస్టర్ ఏం చేశాడో తెలుసా?" అంటూ పగలబడి నవ్వటం ప్రారంభించింది.

హఠాత్తుగా అంత నవ్వు నవ్వవలిసిన సంగతి అందులో ఏముందో నాకు తెలియలేదు.

'తెలియదు' అనే నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే తన నవ్వు ఆపి, "బోనులోకి దూరి తలుపు వేసేసుకున్నాడుట, ఆత్మరక్షణకోసం" అని నవ్వటం మళ్లీ ప్రారంభించింది.

నేనూ నవ్వబోయాను. ఇంతలోకే మా ఆవిడ మూడ్‌కూడా మారిపోయింది మళ్లీ. తిరిగి తన పాతభయాన్ని మొహానికి పులుముకొని చెప్పటం ప్రారంభించింది.

"అలా కనపడ్డ వాళ్లని గాయపరుస్తూ అది తిరుగుతూంటే చివరికి చేసేది లేక దాన్ని కాల్చిపారేశారట. పాపం! పిచ్చిముండ!" అంది, నోటితో చిత్రంగా జాలిని చూపించే శబ్దం చేస్తూ. ఆమె అన్న మాటల్లో ఆఖరి పదం చచ్చిపోయిన సింహానికి ఉద్దేశించబడ్డది!

నాకు ఆ తరవాత మాటలు వినపడటం లేదు. మా ఆవిడ అందించిన వార్త అంతటితోనూ నాకు అవసరం లేదు. నా ఆసక్తిని ఆకర్షించుకొన్న వార్త ఒక్కటే: 'సింహం బోనులోంచి తప్పించుకొంది.'

ఆ తరవాత ఏం జరిగిందో మీకు వివరంగా చెప్పనవసరం లేదనుకొంటాను.

ఆస్తీ, అధికారం నా హస్తగతం అయ్యాయి. ఇంతవరకూ రింగ్ మాస్టర్‌లా నన్ను ఆడించిన మా ఆవిడ ప్రస్తుత పరిస్థితి, సింహం బయటకు వచ్చాక అతనికి పట్టిన గతిలా అయింది. నేను తప్పించుకు వచ్చిన బోనులోకి తనే వెళ్లింది. అంతకంటే గత్యంతరం లేకపోయింది మరి.

బోనులోంచి బయట పడగలిగానన్న తృప్తి నాకు మిగలలేదు. అందులోంచి నేను బయటపడ్డాక ఒకసారి ఒళ్ళు విరుచుకొని ముందుకు చూస్తే నేను వచ్చింది మునపటి ప్రపంచంలోకి కాదని తెలిసింది. నా తప్పు తెలుసుకొనేసరికే ఆలస్యమయిపోయింది. ఇంక నేను తిరిగి బోనులోకి వెళ్లలేను. నా మునుపటి ప్రపంచంలోకి వెళ్లటం విషయంలో ఆశ మొదటే లేదు.

డబ్బూ, దాన్ని ఖర్చు పెట్టగలిగే స్వతంత్ర్యం రాగానే ఆవెనువెంటనే కొత్తకొత్త అలవాట్లు! ఇలా ఒళ్ళూ గుల్లయి పోవడం ప్రారంభించింది.

నా కింక ఈ స్థితి తప్పదు. చేతికందిన ఈ వడమంత్రపు సిరి అయిపోయేదాకా నా కీ పతనం తప్పదు.

కాని, అప్పుడు, 'పాపం! పిచ్చిముండ!' అని చచ్చిపోయిన సింహం మీద మా ఆవిడ చూపగలిగిన సానుభూతి వంటిదికూడా నాకు దొరకలేదనుకొంటా! ★